

రియల్టర్ బరి తెగింపు

- గెడ్డ వాగులోంచి లేఅవుట్‌కు రహదారి ఏర్పాటు
- చోద్యం చూసిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- రైతుల ఆగ్రహంతో ఎట్టకేలకు కదలిక
- వీఆర్వో పర్యవేక్షణలో తొలగింపు

- 8లో

అసంపూర్తిగానే భవనాలు

భరోసా ఇచ్చినా కాంట్రాక్టర్ల వెనుకడుగు

- గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు శ్రీకారం
- సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయిన పనులు
- జిల్లాలో అసంపూర్తిగా 72 సచివాలయాలు, 144 హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు
- పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- బిల్లుల చెల్లింపులో ఎటువంటి జాప్యం ఉండదని భరోసా
- గత చేదు అనుభవాల దృష్ట్యా ముందుకురాని కాంట్రాక్టర్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వ భవన నిర్మాణాలకు శాపంగా మారింది. అప్పట్లో కాంట్రాక్టర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఎన్నో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లుల చెల్లింపునకు ఢోకా లేదని కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారులు భరోసా ఇచ్చినా పనులు పునఃప్రారంభం కాలేదు.



అనకాపల్లి మండలం తుమ్మపాలలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం



రోలుగుంట మండలం జగ్గంపేటలో అసంపూర్తిగా ఉన్న హెల్త్ సెంటర్ భవనం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాల భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 522 సచివాలయాలకు గాను తొలుత 250 భవనాలు నిర్మించి, మిగిలిన వాటిని అద్దె భవనాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే 122 అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు కూడా శ్రీకారం చుట్టింది. ఒక్కో సచివాలయ భవనానికి రూ.20 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.20.50 లక్షలు చొప్పున నిధులు కేటాయిస్తున్నట్టు పేర్కొంది. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం 178 సచివాలయాల భవన నిర్మాణ పనులు మాత్రమే జరిగాయి. మరో 72 సచివాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అలాగే 122 అర్బన్, గ్రామీణ హెల్త్ సెంటర్ భవనాలకు గాను కేవలం 8 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇచ్చినా..

కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాల భవనాలు, హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ... మిగతా 8వ పేజీలో

డ్రైనేజీ పనుల్లో రూ.కోటి అవినీతి

- నిగ్గు తేల్చిన రాష్ట్ర విజిలెన్స్ అధికారులు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే గణేశ్ హయాంలో చేపట్టిన డ్రైనేజీ పనుల్లో రూ.కోటి అవినీతి జరిగిందని రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తేల్చారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అనవసర ఖర్చులు పెట్టడం వలన మునిసిపాలిటీలో అభివృద్ధి జరగలేదన్నారు. అబీద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు చేపట్టిన డ్రైనేజీ పనుల్లో జరిగిన అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి రూ.కోటి అవినీతి జరిగిందని తేల్చారని చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని ఆదేశించారని తెలిపారు. అప్పట్లో పని చేసిన ఇద్దరు మునిసిపల్ అధికారులను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో బలిఘట్టంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఐదేళ్ల డంపింగ్ యార్డులో చెత్త తరలించకపోవడం వలన కొండలా పేరుకుపోయి వర్షం వచ్చినప్పుడు అందులోని మురుగు నదిలో కలుస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే జిందాల్ కంపెనీకి 320 టన్నులు చెత్త తరలించారన్నారు. ఇంకా అక్కడ 6,300 టన్నుల చెత్త ఉందని తెలిపారు. మునిసిపాలిటీలో చెత్త సమస్య పరిష్కారం కోసం రూ.52 లక్షలతో కాంపాక్టర్ కొనుగోలు చేశామని చెప్పారు. రెండు హైడ్రాలిక్ ట్రాక్టర్లు రూ.36 లక్షలతో కొనుగోలు ... మిగతా 8వ పేజీలో

టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికో?



ప్రధానంగా రేసులో నలుగురు నేతలు

- నియోజకవర్గాల ఇన్‌చార్జి పదవులకూ భారీగా పోటీ



బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ



దాడి రత్నాకర్, టీడీపీ సీనియర్ నేత



గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే



లాలం కాశినాయుడు, కోటవురట్ల

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. ఈ పదవి కోసం దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పలువురు టీడీపీ సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నా నలుగురు మాత్రమే ప్రధానంగా రేసులో ఉన్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో రెండు సామాజికవర్గాలకు చెందిన నేతలు ఈ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. వీరిలో ఇద్దరు అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవారు కాగా, మరో ఇద్దరు పాయకరావుపేట, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కీలక నేతలు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుమారుడు దాడి రత్నాకర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన నేతలు కావడం, దీనికి తోడు ఆ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే జిల్లాలో లేనందున జిల్లా పార్టీ పగ్గాలు వారిలో ఎవరికైనా దక్కుతుందని పార్టీ వర్గాలల్లో చర్చ జరుగుతోంది. అలాగే పార్టీ సీనియర్ నేత, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఈ పదవిని ఆశిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాడుగుల టికెట్ ఆశించినా అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గెలుపు కోసం తనవంతు పనిచేశారు. అదే సామాజికవర్గానికి చెందిన పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలానికి చెందిన ప్రస్తుత పార్టీ జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడికి ముఖ్య అనుచరుడిగా కాశినాయుడికి పార్టీలో గుర్తింపు ఉంది.

ఇన్‌చార్జుల నియామకంపై కసరత్తు

ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు కొనసాగుతున్నారు. ఆయనకు అధిష్ఠానం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చింది. ఆయన రెండు పదవుల్లో ఉన్నందున టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా వేరొకరిని నియమించే అవకాశం ఉంది. అలాగే అనకాపల్లి, పెందుర్తి, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జుల నియామకాలు చేపట్టేందుకు అధిష్ఠానం దృష్టి పెట్టిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అనకాపల్లి అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జిగా, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కొనసాగుతున్నారు. ఆయనకు ప్రభుత్వం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ... మిగతా 8వ పేజీలో

అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- లంకెలపాలెం కూడలిలో రోడ్డు ప్రమాద ఘటనపై రవాణా శాఖాధికారుల నిర్ధారణ

లంకెలపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):



ప్రమాదానికి కారణమైన లారీ (ఫైల్ ఫొటో)

జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో ఈ నెల 23న చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదానికి అతి వేగం, డ్రైవర్ లక్కిరెడ్డి కోటిరెడ్డి నిర్లక్ష్యమే కారణమని రవాణా శాఖాధికారులు నిర్ధారించారు. విశాఖపట్నం పోర్టు నుంచి పప్పుల బస్తాలతో తెలంగాణాలోని సిద్దిపేట వెళుతున్న లారీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న మూడు కార్లు, ఆటో, కంటైనర్ లారీ, పలు ద్విచక్ర వాహనాలపై దూసుకువెళ్లడంతో పచ్చికూర గాంధీ, కొణతాల అచ్చెయ్యానాయుడు, వై.ఎర్రప్పడు అనే ముగ్గురు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాలాపు రామ్‌కుమార్, రేఖ అప్పలరాజు ఈ నెల 26న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకునేందుకు జిల్లా రవాణా శాఖాధికారి గోపిశెట్టి మనోహర్ రెండు రోజుల క్రితం లంకెలపాలెం జంక్షన్‌ను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై పరవాడ పోలీసులతో మాట్లాడిన అనంతరం రవాణా శాఖ ఎంవీ ఇన్‌స్పెక్టర్లతో కూడిన బృందాన్ని నియమించారు. ఆ బృందం అన్ని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లనే పెనుప్రమాదం సంభవించిందని నిర్ధారించారు. స్థానిక పెట్రోల్ బంకు నుంచి లంకెలపాలెం జంక్షన్ వరకూ సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా పల్లంగా ఉండడానికి తోడు డ్రైవర్ అధిక వేగంతో దూసుకురావడంతో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగిందని, ఇది కేవలం డ్రైవర్ నిర్లక్ష్యమేనని తేల్చారు.

తీరిన గిరిజన విద్యార్థుల కష్టాలు

- అతికష్టమ్మీద సొలబొంగి గ్రామానికి చేరుకున్న అధికారులు
- చదువు కోసం రోజూ పది కిలోమీటర్లు చేసే సాహస ప్రయాణానికి ముగింపు
- బాలల కష్టాలు తీర్చేలా చర్యలు

మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



సొలబొంగి గ్రామానికి శనివారం కాలినడకన వెళుతున్న అధికారులు

దేవరాపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

చదువు కోసం అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట శివారు సొలబొంగి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థులు పడుతున్న కష్టాలపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. ఆ రెండు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు అనకాపల్లి డీఈవో జి.అప్పారావునాయుడు, అల్లూరి జిల్లా సమగ్రశిక్ష సహాయ పథక సమన్వయకర్త (ఏపీసీ)లెఫ్టినెంట్ డాక్టర్ స్వామినాయుడుతో కూడిన అధికారుల బృందం శనివారం సొలబొంగి గ్రామానికి చేరుకున్నారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంలో 13 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా 12 ఏళ్లలోపు వారే. మరో నలుగురు బడికి వెళ్లకుండా ఉన్నారు. వీళ్లు చదువుకోవాలంటే ఇక్కడ నుంచి కిలోమీటరు దూరం నడిచి శారదానది ఒడ్డుకు చేరాలి. అక్కడ నుంచి బోటులో అర్ధగంటకు పైగా నదిలో ప్రయాణించి అవతలి ఒడ్డుకు చేరాలి. పుస్తకాల బ్యాగు మోసుకుంటూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరాపల్లి మండలం తామరబ్బ ప్రాథమిక పాఠశాలకు చేరాలి. ఇలా రోజూ పది కిలోమీటర్లు సాహస ప్రయాణం చేస్తుంటారు. వర్షాలు కురిస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ వివరాలను అధికారులు సేకరించారు. అల్లూరి జిల్లా కలెక్టర్‌తో సమగ్రశిక్ష ఏపీసీ మాట్లాడారు. ఒకటి, రెండవ తరగతి చదువుతున్న 8 మంది కోసం అక్కడే చదువుకొనే విధంగా నాన్‌రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు విద్యా వలంటీర్‌ను నియమించి సెంటర్‌ను ప్రారంభించారు. మిగిలిన వారిలో మూడు నుంచి ఐదవ తరగతి చదువుతున్న ఐదుగురు బాలబాలికలను పినకోట, జీనబాడులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించడానికి కలెక్టర్ అనుమతించారు. అలాగే మధ్యలో ... మిగతా 8వ పేజీలో



బోటులో బడికి వెళుతున్న సొలబొంగి విద్యార్థులు (ఫైల్ ఫొటో)

రైతు ఉత్పత్తి సంఘాలు మరింత బలోపేతం

- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి సూచన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

ఎలమంచిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు ఉత్పత్తి సంఘాలు మరింత బలోపేతం అయ్యేలా వెలుగు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. శనివారం పట్టణంలోని వెలుగు శిక్షణా కేంద్రం ఆవరణలో జిల్లాలోని 24 మండలాలకు చెందిన వెలుగు ఏపీఎంలు, సీసీలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలన్నారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని సంఘాలన్నీ ఆర్థిక పురోభివృద్ధి సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలను వివరించి వాటిని అధిగమించేలా పలు సూచనలు చేశారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలు, రైతు ఉత్పత్తి సంఘాల అభివృద్ధిలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీవో రాణితో పాటు జిల్లాలోని ఏపీఎంలు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బాబ్జీ X మేయర్

పెందుర్తి టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

- పరిశీలకుడి సమక్షంలోనే వాగ్వాదం
- పార్టీ సమావేశాలకు సంబంధించి తనకు సమాచారం ఇవ్వడం లేదని పీలా ఆరోపణ
- మేయర్‌గా పెందుర్తిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తున్నారా?...అని ప్రశ్నించిన బాబ్జీ
- ఇరువురికీ సర్దిచెప్పిన పరిశీలకుడు



పరిశీలకుడు కోరాడ రాజబాబు సమక్షంలోనే వేదికపై పీలా, బాబ్జీ వాగ్వాదం


పెందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి టీడీపీలో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కాయి. గత కొంతకాలంగా అంతర్గతంగా కొనసాగుతున్న గొడవలు బహిర్గతమయ్యాయి. కార్యకర్తల సమక్షంలో నాయకులు వాగ్వాదానికి దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సంస్థాగత కమిటీల ఎన్నిక, నియామకం కోసం స్థానిక వెలమ భవన్‌లో శనివారం పెందుర్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అధ్యక్షతన ఎన్నికల పరిశీలకుడు కోరాడ రాజబాబు సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, నగర పార్టీ ఉపాధ్యక్షుడు అవగడ్డ అప్పలనాయుడు, తదితరులు హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గండి బాబ్జీ, పరిశీలకుడు కోరాడ రాజబాబులు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకునేలా కమిటీలు నియామకం జరుగుతుందన్నారు. అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతున్న సమయంలో ఇన్‌చార్జి బాబ్జీ నిలువరించడంతో వివాదం మొదలైంది.

టీడీపీ ఇన్‌చార్జి బాబ్జీ వెర్సస్ మేయరు పీలా

పెందుర్తి నియోజకవర్గ సమావేశాలకు ఇన్‌చార్జి నుంచి తనకు కనీస సమాచారం లేదని మేయర్ ... మిగతా 8వ పేజీలో



మత్స్యావతారంలో జగన్నాథుడు

స్థానిక శ్రీకేశవ స్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా శనివారం జగన్నాథస్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- చోడవరం/ఆంధ్రజ్యోతి

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాయత్రీ సేవా ట్రస్ట్ ప్రతినిధులు, కూటమి నేతలు, మునిసిపల్ వైస్ చైర్మన్

ఎలమంచిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 105 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాయత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీవీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, గాయత్రీ సేవా ట్రస్ట్ ప్రతినిధులు పెద్దింటి సూర్యనారాయణ, రాచకొండ పట్టాభిరామయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు గుప్తా, మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను పీవీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు ఊటకూటి రమేశ్, కొఠారు శ్రీను మాస్టారు, చార్టెర్డ్ అకౌంటెంట్ బీఎస్. బంగారు శెట్టి, శిస్టల సన్యాసిరావు మాస్టారు, పప్పు ఈశ్వరావు, అందే రమణ, గంధం శివలు పాల్గొన్నారు.

భీమిలి నియోజకవర్గ పరిశీలకుడిగా కర్రి సాయికృష్ణ



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసిన సాయికృష్ణ

మునగపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం పరిశీలకుడిగా మునగపాక గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా టీడీపీ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసినట్టు సాయికృష్ణ తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహిస్తానని చెప్పారు. సాయికృష్ణకు పలువురు అభినందనలు చెప్పారు.

ధ్యానంపై విస్తృత ప్రచారం



నాగులాపల్లి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యాన సభ్యులతో నిర్వాహకురాలు సుజాత

మునగపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ధ్యానంపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు ధ్యాన గురువు సుజాత తెలిపారు. మండలంలో నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో శనివారం సమావేశం జరిగింది. అంగన్‌వాడీలు , పాఠశాలలు, దేవాలయాలతోపాటు ఇంటింటికీ ధ్యానంపై ప్రచారం చేసేందుకు సభ్యులు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రస్తు త సమాజంలో అనేక ఆకర్షణలు, ప్రతికూల ప్రభావాలు పిల్లలు, యువతపై తీవ్రంగా చూపుతున్నాయన్నారు. వారిని వాటి నుంచి బయటకు తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. ఒత్తిడి నుంచి దూరం చేసి ప్రజలకు శాంతిని సమకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



ఆర్‌పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్, చైర్‌పర్సన్

ఎలమంచిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు, మెప్మా ఆర్‌పీలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆకాంక్షించారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణలో మెప్మా ఆర్‌పీలకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో సాఫ్ట్‌వేర్ రంగానికి అభివృద్ధి చేశారని, నేడు అది ఎంతో విస్తరించి ఉపాధి కల్పిస్తోందన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డ్వాక్రా సంఘాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందన్నారు. నైపుణ్యతను పెంపొందించుకుని మహిళలు నూతన ఒరవడితో నెలకు రూ. లక్ష సంపాదించే స్థాయికి ఎదగాలన్నారు. అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రీసోర్స్ పర్సన్‌లకు విధి నిర్వహణలో ఉపయోగంగా ఉండాలనే ప్రభుత్వం ఈ ట్యాబ్‌లను అందించిందన్నారు. మహిళ తమకు తాము నిలబడి, మరి కొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు సమష్టిగా ఉంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అనంతరం 49 మంది ఆర్‌పీలు, సిబ్బందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం. పద్మావతి, డీఎంసీ వరలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ భర్త కొఠారు కొండబాబు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఊటకూటి రమేశ్, పిట్టా శ్రీను, కొఠారు శ్రీను మాస్టారు, అందే రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా పీలా తులసీరామ్



సమావేశంలో టీడీపీ శ్రేణులు

అచ్యుతాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా పీలా తులసీ రామ్ ఎంపికయ్యారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన సమక్షంలో ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల అప్పారావు, ఉపాధ్యక్షుడిగా దేశంశెట్టి వెంకట రమణ, కార్యనిర్వహక కార్యదర్శులుగా పుర్రె శ్రీనివాస యాదవ్, అడిగర్ల ప్రసాద్, ధర్మిరెడ్డి రామకృష్ణ, కార్యదర్శులుగా మల్ల చిన్నబాబు, బండి సూరిబాబు, సింగంపల్లి అప్పారావు, కోశాధికారిగా మచ్చు గంగరాజును నియమించారు. క్లస్టర్ ఎనిమిది కన్వీనర్‌గా మామిడి శివ అప్పారావు, క్లస్టర్ తొమ్మిది కన్వీనర్‌గా రాజాన అప్పలనాయుడు, 10 కన్వీనర్‌గా యాండ్ర అప్పల నాయుడు, కో కన్వీనర్‌గా కొవిరి బంగారయ్య ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్ కుమార్ నీరుకొండ నరసింగరావు, కర్రి ఆదిబాబు, లాలం రాము, రాజాన నానాజీ, గుడివాడ జయకుమార్, పతివాడ చిన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథస్వామి



నాగులాపల్లి జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

మునగపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జగన్నాథుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మునగపాక, నాగులాపల్లి ప్రధాన ఆలయాల నుంచి బలరాం, సుభద్ర సమేతంగా రథంపై తరలి వచ్చి ఇంద్రద్యుమ్న హాలులో కొలువైన జగన్నాథస్వామి శనివారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు దేవతామూర్తులకు అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. నాగులాపల్లిలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ఎమర్జెన్సీలో అన్ని వర్గాలకు గడ్డు రోజులే..

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

మునగపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో అప్పట్లో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో శనివారం ఎమర్జెన్సీ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఆనాటి పరిస్థితులను నేటి తరానికి తెలియజేసేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీవీకే కళాశాల పూర్వ ప్రిన్సిపల్ వై.సత్యారావు మాట్లాడుతూ ఎమర్జెన్సీని వ్యతిరేకించడంతో విద్యార్థులు కూడా చురుకైన పాత్ర పోషించారన్నారు. వారిపైన కూడా కేసులు బనాయించారన్నారు. అప్పట్లో పత్రికా స్వేచ్ఛకు కూడా భంగం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్.ప్రిన్సిపల్ ఈశ్వరరావు, బీజేపీ నాయకులు మళ్ల కాశేశ్వరరావు, బద్దెం సూర్యనారాయణ, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యా శాఖ కార్యాలయం



ప్లాస్టిక్ బకెట్లలో వర్షం నీరు పడుతున్న దృశ్యం

కోటవురట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో గల మండల విద్యాశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ఇందులో రెండుగదులు, వరండా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో శ్లాబ్ పెచ్చులూడడమే కాకుండా వర్షంవస్తే నీరు గదులలోకి చేరిపోతోంది. అయినా, గత్యంతరం లేక ఈ భవనంలో ఇద్దరు ఎంఈవోలు, సిబ్బంది విధులు సాగిస్తున్నారు.ఒక గదిలో ఇద్దరు ఎంఈవోలు, మరొక గదిలో కంప్యూటర్ ఆపరేటర్ ఇతరసిబ్బంది పనిచేస్తున్నారు. వరండాల్లో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు, పుస్తకాలు ఇతరసామగ్రి భద్రతకోసం ఏర్పాటుచేశారు. భవనం శ్లాబ్ పూర్తిగా శిథిలమైంది. వర్షాలకు రికార్డు లు, ఉపాధ్యాయులు ఎస్ఆర్‌లు ఎక్కడ తడిసిముద్దఅవుతాయే నని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి ఎంఈవో కార్యాలయం భవనం స్థానంలో కొత్తభవనం నిర్మించాలని కోరుతున్నారు.

'సంపద కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'



అప్పన్నపాలెం కాలనీ సమీపంలోని సంపద కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రాంబిల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా డీపీఆర్‌సీ అధికారి, రాంబిల్లి మండల ప్రత్యేకాధికారిణి ఇ.నాగలక్ష్మి కార్యదర్శులను హెచ్చరించారు. శనివారం ఆమె మండంలోని గొరపూడి, హరిపురం, వెల్చూరు, లాలంకోడూరు, రాంబిల్లిలోని చెత్తనుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. వీటినిర్వహణలో పంచాయతీ అధికారులు పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాలు వద్ద చెత్త నిల్వలు అధికంగా ఉండటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్వహణలో ఇకపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాంబిల్లిలో సంపద కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్‌డీ రాజు తదితరులు ఉన్నారు.

హరిపాలెంలో జిమ్ ప్రారంభం



జిమ్ ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధి కిశోర్

అచ్యుతాపురం రూరల్, జూన్ 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం విజయదుర్గ ఆలయ ప్రాంగణంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో ఎంఆర్ఎఫ్ టైర్స్ అధినేత లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మినీ జిమ్‌ను క్లబ్ పీడీ జి.కిశోర్ శనివారం ప్రారంభించారు. సుమారు రూ. 75 వేల వ్యయంతో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మారిశెట్టి సూర్యనారాయణ (ఎంఎస్), ప్రముఖ న్యాయవాది శరగడం అప్పలనాయుడు, లక్ష్మి జ్యోతిర్మయి, ప్రసాద్, కాండ్రేగుల అప్పారావు, రాము, మారిశెట్టి రాము, వెంకట అప్పారావు, శరగడం శ్రీను పాల్గొన్నారు.

డీటీగా మురళీధర్



మునగపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా ఆర్.వి.మురళీధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన శేషుబాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బుచ్చయ్యపేటనుంచి మురళీధర్ ఇక్కడకు వచ్చారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉచిత సీట్లపై తల్లిదండ్రుల ఫిర్యాదు



వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాయకరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ద్వారా పేదలకు ఇవ్వాల్సిన ఉచిత సీట్లపై తల్లిదండ్రులు శనివారం ఎంఈవో కేఎస్.గాంధీకి ఫిర్యాదు చేశారు. పీఎల్.పురం సమీపంలోని రెండు విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం పేదలకు సీట్లు ఇవ్వడం లేదని టి.నూకరత్నం, మోర్త సాయిభరత్, ఆర్.రమ, షేక్‌రావుబేగం తదితరులు ఆరోపించారు. శ్రీప్రకాశ్‌లో 44 సీట్లు, తిరుమలలో ఏడు సీట్లను విద్యా హక్కు చట్టం ద్వారా విద్యార్థులు పొందారని, వారికి సీట్లు ఇవ్వడానికి యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం దాటితే అర్హత ఉండదని, ప్రభుత్వం పేదలకు కేటాయించిన సీట్లను ఇప్పించాలని విన్నవించారు. దీనిపై ఎంఈవో గాంధీని వివరణ కోరగా ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గారా కృష్ణ ప్రసాద్, గిరిధర్, గొల్లపల్లి నాగు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ల పంపిణీ



రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాయకరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతులకు శనివారం టార్పాలిన్లను పంపిణీ చేశారు. తాండవ వాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో చిరుధాన్యాల పరిశోధన సంస్థ సహకారంతో సుమారు 60 మంది సభ్యులకు ఉచితంగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జి.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరితే నాబార్డు, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థల ద్వారా పథకాలు అందుతాయన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను విలువ జోడించి విక్రయించడం వల్ల ఎక్కువ గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పి.సూర్యనారాయణ, కన్వీనర్ జి.వర్మ, కోఆర్డినేటర్ పి.వి.కృష్ణ పాల్గొన్నారు.

మంగవరంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో శుక్రవారం పర్యటించిన డీపీవో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించడంతో పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారాలను ఎక్స్‌కేవేటర్‌తో తొలగించారు. కాలువలలోని పూడికను తొలగించినట్టు డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

సామాజిక తనిఖీల్లో నిర్ధారణ.. ప్రజా వేదికలో వెల్లడి



ప్రజా వేదికలో వీఆర్‌పీ గురించి ప్రశ్నిస్తున్న సర్పంచ్ కృష్ణప్రసాద్

పాయకరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీల ప్రజా వేదికలో సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికను డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 24 గ్రామ పంచాయతీలలో చేపట్టిన సుమారు 1303 పనులపై నివేదికలను సోషల్ ఆడిట్ సిబ్బంది చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.9.43 కోట్లు ఖర్చు చేయగా, కూలీలకు వేతనాలుగా రూ.7.05 కోట్లు, సామగ్రి చెల్లింపులకు రూ.2.38 కోట్లు చెల్లించినట్టు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా కూలీల మస్తర్లు, కొలతల్లో తేడా, మస్తర్లలో కూలీల సంతకాలు లేకపోవడం, హాజరు లేకుండా వేతనాలు చెల్లించడం, పని ప్రదేశాలు తేడాలు వంటి తప్పిదాలను గుర్తించారు. వీటిని సామాజిక తనిఖీల సిబ్బంది ప్రజావేదికలో వెల్లడించారు. శ్రీరాంపురం గ్రామంలో గతంలో పనిచేసిన వీఆర్‌పీ పలు అక్రమాలకు పాల్పడ్డారని, అతన్ని తొలగించి ఇంతవరకు కొత్త వారిని ఎందుకు వేయలేదని సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్ అధికారులను నిలదీశారు. అలాగే ఉపాధి పథకం నిధులతో వేసిన రోడ్లు పక్కన కాలువలు నిర్మించాలని తీర్మానం చేసినా ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. నామవరంలో గతంలో పనిచేసిన వీఆర్‌పీ 130 మందికి పనులు చేసినట్టుమస్తర్లు వేసి డబ్బులు కాజేశారని, తరువాత జాబ్‌కార్డులు డిలీట్ చేశారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు కురందాసు శివ కోరారు. అరట్లకోటలో ఉపాధి నిధులతో వేసిన రోడ్లకు పక్కన గ్రావెల్‌తో కప్పలేదని, దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందని ఫిర్యాదు చేశారు. గోపాలపట్నం గ్రామంలో ట్రెంచ్ వర్కుల సంఖ్య, కొలతలు తేడా ఉన్నాయని ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు బి.శ్రీనివాస్, ఎరకయ్య, ఆడిట్ ఎస్‌టీఎం కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ చిరంజీవి, ఏపీఎం నానిబాబు, టీఏ క్రాంతి, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, కాశీవిశ్వనాథ్, వంకా రమణ, యాళ్ల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వైపు.. పిల్లల చూపు

▸▸ ఆదర్శంగా దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాల

▸▸ ఒకే రోజు 32 మంది ప్రైవేటు విద్యార్థుల చేరిక



దేవవరం పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

నక్కపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. అధిక సంఖ్యలో వచ్చి బడుల్లో చేరుతున్నారు. గత నెలలో విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకున్న పిల్లలు అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో అందరూ సర్కారు పాఠశాలల వైపు చూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన బియ్యాన్ని కూడా వినియోగిస్తున్నది. ఇటీవల ఎంత మంది పిల్లలు వుంటే, వారందరికీ కూడా తల్లికి వందనం ఆర్థిక సాయం ఖాతాల్లో జమ చేసింది. ఎంతో నైపుణ్యత, అర్హత, అనుభవం వున్న ఉపాధ్యాయుల బోధన ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు దొరుకుతోంది. ఇన్ని సదుపాయాలు ఉండడంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి కనబర్చుతున్నారు.

నక్కపల్లి మండలంలోని దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఒక్క రోజే ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 32 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడాన్ని విద్యా శాఖ అధికారులను సైతం ఆశ్చర్యపర్చింది. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యా శాఖాధికారి కె.నరేశ్, దేవవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు మోడల్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, ఈ స్కూల్‌లో చేరిన పిల్లలకు ఆశీస్సులు అందజేశారు. అలాగే తల్లిదండ్రులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి ఎంఈవో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకట్రావ్, డీఆర్‌కే శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోపూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా వారాహి పూజలు

నక్కపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శివాలయంలో శనివారం వారాహి నవరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఆలయంలో ముక్కంటికి అభిషేకం అనంతరం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తుల గోత్రనామాలతో ఆలయ అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంతోశ్ పూజలు చేస్తున్నారు. శనివారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. వారాహి దీక్షాపరులతో పాటు పి.నానాజీ, పప్పల శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల సర్వే నిలిపివేయాలని ఆందోళన



డీఎల్.పురంలోసర్వేను ఆపేయాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్థులు

నక్కపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఎల్.పురం గ్రామంలో ఇప్పటివరకు కారిడార్ కోసం సేకరించిన భూములు కాకుండా అదనంగా భూములు కావాలంటూ చేస్తున్న సర్వే నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం భూ సేకరణ వద్దంటూ ఆందోళనకు దిగారు. తాజాగా బల్క్‌డ్రగ్, స్టీల్‌ప్లాంట్ కోసం అదనపు భూములు కావాలంటూ వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురం గ్రామాల్లో సర్వే చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అదనపు భూ సేకరణను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. బలవంతంగా రసాయన పరిశ్రమలకు రైతుల నుంచి భూములు సేకరించడం తగదని వారు పేర్కొన్నారు.

పారిశుధ్య సమస్య లేకుండా చూడండి

▸▸ ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు



రాజవరంలో ఇంటింట చెత్త సేకరణ పరిశీలిస్తున్న ఎంపీడీ జయప్రకాశరావు

పాయకరావుపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు ఆదేశించారు. మండలంలోని రాజవరం, గజపతినగరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటి నుంచి చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. అలాగే గ్రామంలో ఎక్కడా చెత్తా, చెదారాలు ఉండకూడాని స్పష్టం చేశారు. పారిశుధ్య సమస్య ఎక్కడా లేకుండా చూడాలని సూచించారు. అనంతరం రక్షిత నీటి పథకం ట్యాంకును ఆయన పరిశీలించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, గోసల రమణ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అనకాపల్లిలో కూర్మావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు

కూర్మావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్/కశింకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి రథోత్సవం అనకాపల్లి, కశింకోటలలో అత్యంత ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రజ్యామ్మ మందిరం, కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత స్వామివారు శనివారం కూర్మావతారంలో దర్శనమిచ్చారు. తొలుత వేకువజామున అర్చకులు విశేష అలంకరణలు చేపట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన జగన్నాథుడు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాగభూషణం, తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు శనివారం డీఎస్పీ ఎం.శ్రావణిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండడం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా ఉందని, సరైన నియంత్రణ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాగా ఏర్పడిన దగ్గర నుంచి జనాభా పెరుగుదలతో పాటు వాహనాల రద్దీ కూడా పెరిగిందని వివరించారు. సిగ్నల్ వ్యవస్థ ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈయన వెంట సంస్థ ప్రతినిధులు రొబ్బి మల్లేశ్వరరావు, బి.సోమరాజు, ఎ.రమణమూర్తి, నాగేశ్వర రావు, రమేష్ తదితరులు ఉన్నారు.

లంకెలపాలెం కూడలిలో స్టాపర్లు ఏర్పాటు



కూడలిలో సాపర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

లంకెలపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు రవాణా శాఖ, స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం కూడలిని పరిశీలించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం ఎంవీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, పరవాడ ఎస్ఐ వెలమల సత్యనారాయణ కూడలికి రెండు వైపులా కొలతలు తీసుకొని సాపర్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రమాద సూచిక బోర్డులను అమర్చారు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డైట్‌లో ఘనంగా పోస్టు గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

అనకాపల్లి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ ఇ.అనిల్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన సమగ్రత, సామాజిక బాధ్యత ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు ముఖ్య అతిథి అనిల్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరు మారాలి.. మార్పు రావాలి

▸ రౌడీ షీటర్లకు, సస్పెక్ట్ షీటర్లకు ఎస్పీ హెచ్చరికలు ▸ వీరి కోసం సరికొత్త కార్యక్రమాలు ▸ వారంలో ఒకరోజు ఆయా స్టేషన్లలో కౌన్సెలింగ్

అనకాపల్లి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : 'చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళితే ఉపేక్షించేది లేదు'.. అంటూ జిల్లాలో రౌడీ షీటర్లకు, సస్పెక్ట్ షీటర్లకు ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై ప్రతి శనివారం అనకాపల్లి జిల్లా పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో వీరికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

ప్రతి శనివారం హాజరు కావాల్సిందే..

జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలోని మొత్తం 390 మంది రౌడీ షీటర్లు పోలీసుల లెక్క ప్రకారం ఉన్నారు. వీరంతా ప్రతి శనివారం తమ తమ ప్రాంత పోలీస్ స్టేషన్‌ల్లో కౌన్సెలింగ్‌కు విధిగా హాజరు కావాలి. ఏమైనా అత్యవసర పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే... అందుకు గల కారణాలు ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు తెలియజేయాలి. వారి అనుమతితోనే బయటకు వెళ్లాలి. ప్రతి శనివారం ఉదయం పదిన్నర గంటల నుంచి పదకొండున్నర గంటల వరకు వీరికి ఆయా స్టేషన్లలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు కౌన్సెలింగ్ చేస్తారు. అనంతరం అక్కడి రిజిస్టర్‌లో సంతకాలు చేస్తారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారుల సైతం వీరి రోజు వారీ కార్యకలాపాలను ఆరా తీస్తారు. ఏం చేస్తున్నారు....? ఎక్కడుంటున్నారు.....? తదితర విషయాలను తెలుసుకుంటారు. స్పెషల్ బ్రాంచ్ విభాగం పోలీసులు సైతం వీరి కదలికలపై నిఘా పెట్టి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తారు.

గంజాయి వల్ల దుష్పరిణామాలు వివరిస్తూ...

జిల్లాలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకే కాకుండా గంజాయి బ్యాచ్ సభ్యులు కూడా పోలీసులకు సవాళ్లు విసురుతున్నారు. దీంతో ఎస్పీ తుహిన్‌సిన్హా వీరిపైన కూడా గట్టి నిఘా పెట్టేలా అధికారులను అప్రమత్తం చేశారు. వీరి రోజు వారి కార్యకలాపాలపై స్పెషల్ బ్రాంచ్ ఆరా తీస్తుంది. గంజాయి రవాణాకు పాల్పడుతూ పట్టుబడుతున్న వారికి ప్రత్యేకంగా గంజాయి వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. సన్మార్గంలో పయనించాలని పోలీసులు సూచిస్తున్నారు. వీరిలో మార్పు తీసుకువచ్చేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



కశింకోటలో రౌడీ షీటర్లకు సీఐ స్వామినాయుడు కౌన్సెలింగ్ (ఫైల్)

గంజాయి రవాణా పై ఉక్కుపాదం

గంజాయి కొనుగోలు, విక్రయ ముఠాపై పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. కరుడు కట్టిన గంజాయి స్మగర్లపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే జిల్లా బహిష్కరణ చేస్తామని ఎస్పీ హెచ్చరిస్తున్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

పక్కాగా పారిశుధ్య నిర్వహణ

▸ జడ్పీ సీఈవో నారాయణమూర్తి



గ్రామస్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు పక్కాగా చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్‌లో వెనకంజలో ఉన్న మండలంలోని గొల్లలపాలెం, శివారు గ్రామాలైన అప్పయ్యపాలెం, తమ్మయ్యపాలెంలలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరగాలన్నారు. ఆ చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించిన ట్యాంకులను క్లోరినేషన్ చేయడంతో పాటు పరిసరాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ఆర్అండ్‌బీ అధికారుల అనుమతులు తీసుకొని సచివాలయం సమీపంలో డ్రైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. చెత్త సేకరణలో ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ డి.చైతన్య, సర్పంచ్ మోపాడ అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్

▸ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



టీ అండ్ వీ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ జిల్లాలో ఆశాజనకంగా ప్రారంభమైందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. శనివారం ఇక్కడ నిర్వహించిన టీ అండ్ వీ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఈ సీజన్ కూడా మంచి దిగుబడులు రాగలవన్నారు. మే, జూన్ నెలల్లో సాధారణ వర్షపాతం 231 మిల్లీ మీటర్లకు ఇప్పటివరకు 272 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. వ్యవసాయ శాఖ ప్రతినిధి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు పెద్ద ఎత్తున పచ్చిరొట్ట పంటలైన జనుము, పిల్లిపెసర వేయాలని సూచించారు. రైతులకు అవసరమైన వరి, పప్పు ధాన్యాలు, నూనె గింజల విత్తనాలు, సజ్జ విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ బి.భవానీ, డాక్టర్ ఆర్.సరిత, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏలు, హెచ్‌వోలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు



రేబాకలో వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ పోలీసులు

కొత్తూరు, కశింకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రేబాక జాతీయ రహదారిపై రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్ సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. అంతే కాకుండా హెల్మెట్ ధరించకుండా, రికార్డులు లేకుండా ఉన్న వాహనాలకు జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేశామని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

కశింకోటలో..

కశింకోట జాతీయ రహదారిపై సీఐ అల్లు స్వామినాయుడు వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేశామని చెప్పారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించామన్నారు. పరిమితికి మించి వాహనాలు నడిపిన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ జరిపారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



కశింకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏఎస్ పేట, నర్సింగబిల్లి గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు శనివారం నట్టల నివారణ మందులను వేశారు. ఈ సందర్భంగాద పశువైద్యాధికారిణి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లోనూ 235 మేకలు, 430 గొర్రెలకు మందును ఉచితంగా వేశామని చెప్పారు. అనంతరం వీటి సంరక్షణపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మందపల్లి శివ, కె. వెంకటేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸ మత్స్యకార భృతి పెంచిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

▸ మత్స్యకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాలు

అనకాపల్లి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార భృతిని రూ.20 వేలకు పెంచినందుకు సాంప్రదాయ మత్స్యకార కులాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. శనివారం సాయంత్రం సమాఖ్య జిల్లా సమావేశం ఇక్కడి ఓ హోటల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. మత్స్యకారులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన వృత్తిపరమైన పరికరాలు, వలలు, ఇంజన్లు, తెప్పలు, ఐస్‌బాక్సులు మత్స్యకార భరోసా లాంటివన్నీ అందిపుచ్చుకొని వృద్ధిలోకి రావాలన్నారు. జిల్లాలోని పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు, ముత్యాలమ్మపాలెం, రేవుపోలవరం, పెంటకోట సముద్ర ప్రాంతాల్లో జెట్టీల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అర్జున్ మాట్లాడుతూ పరిశ్రమల కారణంగా మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆయా పరిశ్రమల్లో మత్స్యకార యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మత్స్యకార సంఘానికి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు సాయిబలరామ్, ఎం.రాంబాబు, రమణ, చేపల మసేను, చోడిపల్లి దేముడు, చింతకాయల అమ్మోరు, సిరసపల్లి ఆదిబాబు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్నాథరావు, కాశీవిశ్వనాథ్, లోవరాజు రాందాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలు

ముత్యాలమ్మపాలెంలో వాటర్, అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కు

▸ టూరిజం శాఖతో జనరస్ గ్రూపు ఎంఓయూ

అనకాపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) అనకాపల్లికి చెందిన మెసర్స్ జనరస్ గ్రూప్ సంస్థతో పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో వాటర్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కు ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. సదరు ఒప్పంద పత్రంపై ఏపీటీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమీషాలతా, జనరస్ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఎంఓయూ పత్రాన్ని శుక్రవారం విజయవాడలో టూరిజం టెక్ ఏఐ 2.0 కాన్‌క్లేవ్ వేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జనరస్ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ బుద్ధ మురళీధర్ అందుకున్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా ముత్యాలమ్మపాలెంలో ఆరు కోట్ల రూపాయల పెట్టుబడితో వాటర్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా 60 మందికి ఉపాధి కల్పించనున్నట్టు మురళీధర్ తెలిపారు.



సీఎం చంద్రబాబు ద్వారా ఎంఓయూ పత్రాన్ని అందుకుంటున్న జనరస్ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ బుద్ధ మురళీధర్

సమన్వయ కమిటీ సమావేశంతో సమస్యలు పరిష్కారం

- ఎంపీడీవో రవికుమార్

కశింకోట. జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఇదో చక్కటి వేదికగా పేర్కొన్నారు. గతంలో పోలీసు స్టేషన్‌లో భూ వివాదాలపై ఫిర్యాదు చేసిన వారికి పిలిపించి సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. సింగవరం గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములకు చెందిన సమస్యపై ఫిర్యాదు అందింది. అయితే ఇరువర్గాలు రాకపోవడంతో వచ్చే వారానికి వాయిదా వేశామని ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

నేత్రపర్వంగా వారాహి అమ్మవారి ఉత్సవాలు



దేవీపురంలో వారాహి అమ్మవారికి భక్తుల పూజలు

సబ్బవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు శనివారం గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం, కుంకుమార్చనలు జరిపారు. విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించి తరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి స్వప్న వారాహీ హోమం చేపట్టారు. శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

కశింకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ సూచించారు. మండలంలోని బయ్యవరంలో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. వీధుల్లోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వర్షా కాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులకు హాజరైన కూలీల వివరాలు తెలుసుకున్నారు. పనికి తగ్గ వేతనం అందుతున్నదీ లేనిది ఆరా తీశారు. అక్కడి నుంచి సంపద కేంద్రానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చెత్త ద్వారా ఎరువును తయారు చేసి పంచాయతీకి ఆదాయం సమకూరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు కోన అప్పారావు మాట్లాడుతూ విద్యాభివృద్ధి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

63 అడుగుల మట్టి గణపతి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం

చోడవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం సమీపంలో 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్వయంభూ గణపతి ప్రశస్తి మరింత మందికి తెలిసేలా స్థానిక సద్భావన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 63 అడుగుల భారీ మట్టి విగ్రహం నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సందర్భంగా వినాయకుని ఆలయ సమీపంలోని స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ మట్టి విగ్రహం పనులు పూర్తి కావడానికి రెండు నెలలకుపైగా సమయం పడుతుందని, ఉత్సవాల నాటికి సిద్ధమవుతుందని సద్భావన ఫౌండేషన్ ఫౌండర్ కె.రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గూనూరు మల్లునాయుడు, పెద బాబు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న మలుపు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ప్రమాదకరంగా మలుపు

పరవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ జంక్షన్ నుంచి ఫార్మాసిటీ మీదుగా లంకెలపాలెం వెళ్లే ప్రధాన మార్గంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల రహదారి మలుపు వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి గుండా ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్, సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు మలుపు సమీపంలోనే పెద్ద డౌన్.... ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఇదే మలుపు వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు తక్షణమే కలుగజేసుకొని మలుపు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చురుగ్గా సాగుతున్న అక్విడక్ట్ పనులు


పిల్లర్లకు వీలుగా బేస్‌మెంట్


రెండేళ్ల క్రితం కాలువకు కింద ఏర్పాటు చేసిన కర్రలు (ఫైల్‌ఫొటో)

ఎట్టకేలకు మర్రివాడ అక్విడక్ట్‌కు మోక్షం

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మాణాలు
- సుమారు 2 వేల ఎకరాలకు తీరనున్న సాగునీటి సమస్య
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం

కొయ్యూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రివాడకు చెందిన గైరమ్మ చెక్‌డ్యామ్ ప్రధాన అక్విడక్ట్ (కాలువకు ఏర్పాటుచేసిన వంతెన)కు మోక్షం లభించనుంది. కూటమి ప్రభుత్వ చొరవతో ఉపాధి హామీ పథకంలో రూ. 25 లక్షలు కేటాయించటంతో ఈ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రానున్న ఖరీఫ్‌కు సాగునీరందించేందుకు వీలుగా ఎస్‌ఎంఐ జేఈ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్మాణాలు త్వరితగతిన సాగుతున్నాయి. గత ఏడాది జూలై 27న కురిసిన భారీ వర్షాలకు అక్విడక్ట్ కూలిపోవటంతో రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి సాగునీటిని పునరుద్ధరించుకున్నారు. సుమారు 2000 ఎకరాలకు సాగునీరు అందించే చెక్‌డ్యామ్ అక్విడెక్ట్ 2022లో పిల్లరు కుంగికూలిపోయే స్థితికి చేరింది. అప్పటినుంచి ఖరీఫ్ సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. బూదరాళ్ళ కొండలపై నుంచి వచ్చే వాగు ప్రవాహాల నీటిని సాగునీటి అవసరాలకు మరలిచేందుకు మర్రివాడ సమీపంలో గైరమ్మ చెక్‌డ్యామ్ నిర్మించారు. దీనిద్వారా మర్రివాడకు చెందిన భూములతో పాటు దొడ్డవరం, చీడిపాలెం, కొయ్యూరు గ్రామాలకు చెందిన సుమారు 2000 ఎకరాలలో ఏటా రెండు పంటలు పండించుకునేందుకు వీలుగా సాగునీరందేది. అయితే ఈ చెక్‌డ్యామ్ ప్రధాన కాలువకు మర్రివాడ నుంచి దొడ్డవరం గ్రామాల మధ్యలో నాలుగు ప్రాంతాలలో సిమెంట్ పిల్లర్లు వేసి అక్విడక్ట్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధానంగా చెక్‌డ్యామ్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో పొత్తూరు, తాళ్ళ వారి పొలాలకు సమీపంలో ఏర్పాటు చేసిన అక్విడక్ట్ పిల్లరు మూడేళ్ల కిందట కుంగిపోవడంతో రైతులు కర్రలను దన్ను పెట్టారు. గత జూలైలో కురిసిన భారీ వర్షాలకు అక్విడక్ట్ పిల్లర్లు కుంగిపోయి పూర్తిగా శిథిలమైంది. చెక్‌డ్యామ్ ద్వారా సాగుభూములకు నీరు వెళ్లేందుకు లేకుండా పోయింది. దీంతో 2024 ఖరీఫ్‌లో ఈ భూములకు సాగునీరు ప్రశ్నార్థమైంది. దీంతో రైతులు తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. 15 ఆ యిల్ డ్రమ్‌లను ఒకదానికి ఒకటి జతచేస్తూ వెల్డింగ్ చేయించి వాటిని ఆయకట్టు కింద రైతులు తీసుకువెళ్లి కూలిన అక్విడక్ట్ వద్ద అమర్చి సాగునీటిని పునరుద్ధరించారు.

ఇలా గత ఖరీఫ్ సీజన్‌లో సాగునీరించడంలో రైతులు సఫలీకృతులయ్యారు. సీజన్ అనంతరం అక్విడక్ట్ పునర్నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులు, పాలకులు దృష్టికి వినతిని ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేసింది. గత ఏప్రిల్‌లో వర్షాలు పనులు ముందుకు సాగలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత మే మూడో వారం నుంచి పనులు ముమ్మరం చేశారు. దీంతో బేస్‌మెంట్ వేసి పిల్లర్లు నిర్మించే పనులు పూర్తి చేస్తున్నారు. మరో నెల రోజుల్లో అక్విడేట్ నిర్మాణాలు పూర్తి చేసి ఖరీఫ్ సాగుకు సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుండడంతో ఆయకట్టు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

ఖరీఫ్ నాటికి పనులు పూర్తి: ఎస్‌ఎంఐ జేఈ రామకృష్ణ

ఈ విషయమై ఎస్‌ఎంఐ జేఈ రామకృష్ణను సంప్రదించగా, అక్విడేట్ మరమ్మతులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోరూ. 6 లక్షలతో ప్రతిపాదనలు పంపగా నిధు లు మంజూరు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తిరిగి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. దీంతో ఫిబ్రవరిలో రూ. 25 లక్షలు మంజూరు చేశారని తెలిపారు.ఖరీఫ్ నాటికి సాగునీటి సమస్య రాకుండా నెల రోజుల వ్యవధిలో నిర్మాణాలు పూర్తవుతాయన్నారు.

గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేయొద్దు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు



డి.వి.జి.శంకరరావు

అరకులోయ,జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మూసివేసిన పాఠశాలలను తెరచి విద్యార్థులకు చదువుకునేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు ఆదేశించారు. అరకులోయ మండలంలో 31 ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూసి వేసినట్టు పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. తక్షణం ఐటీడీఏ అధికారులు గిరిజన విద్యార్థులు విద్యావ సంవత్సరం నష్టం పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అరకులోయ మండలంలో లోతేరు పంచాయతీ పరిధిలో 11 పాఠశాలలు మూతబడి ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి మూతబడిన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని కోరారు. ఇప్పటికే పాటశాలలు ప్రారంభమైనందున విద్యార్థులంతా బడులకు వచ్చి చదువుకునేలా చూడాలన్నారు. తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు సత్యబాబు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

చింతపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులు గొర్లె సత్యబాబు సేవలు అభినందనీయమని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1లో పదవీ విమరణ పొందనున్న బొర్రి జీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు దంపతులను స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ 39 ఏళ్లపాటు వివిధ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా సత్యబాబు పనిచేశారన్నారు. ఆయన సర్వీసులో ఒక్క రిమార్కులేదన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సత్యబాబు దంపతులను ఘనంగా సత్కరించారు.ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, ఎస్‌టీవో శంకరరావు, స్కూల్ కాంప్లెక్స్ పీజీహెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్, ఏపీజీఈఏ విశాఖ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ గసాడి పద్మనాభం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, ఏపీటీఎఫ్ నాయకుడు దేపూరి శశి కుమార్, జర్రెల, లోతుగెడ్డ పీజీహెచ్‌ఎంలు సింహాచలం, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో స్వచ్ఛ భారత్


సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సీలేరు, జూన్ 28, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకరరా వు ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు కలసి ఇటీవల కురిసిన వర్షాలకు కాలేజీ చుట్టూ ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రతి శనివారం ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు ప్రిన్స్‌పాల్ శంకరరావు ఈ సందర్భంగా తెలిపారు.

గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు


ముంచంగిపుట్టు గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కుమార్‌రాజు

ముంచంగిపుట్టు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పని దినాల్లో విధిగా గ్రంథాలయాన్ని తెరవాలని విశాఖ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజు అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. పలు రకాలం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పేపర్లు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు.అయితే, ఇక్కడి నూతన గ్రంథాలయం ప్రారంభం నుంచీ మూసే ఉంటుంది. ఆ సంస్థ జిల్లా అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న గ్రంథాలయాన్ని నిర్వాహకులు శనివారం తెరిచి ఉంచడం విశేషం.ఇకనైనా గ్రంథాలయాన్ని రోజూ తెరచేలా చూడాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

హుకుంపేట పరిశీలకుడిగా దొరబాబు



కొయ్యూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబును హుకుంపేట పరిశీలకుడిగా అధిష్టానం ఆదేశాలు జారీ చేసిందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో పార్టీ విజయపథంలో నడిపించేలా తన సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

104 సేవలు దూరం..

- వాహనానికి తరచూ మరమ్మతులు
- పినకోట పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లోని గిరిజనులకు అవస్థలు

అనంతగిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, దివ్యాంగులకు అవసరమైన ప్రాథమిక వైద్యసేవలను అందించేదిశగా 104 వాహనాలను ఏర్పాటు చేశారు. అయితే, పినకోట పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఈ వాహనం ద్వారా కొద్దిరోజులుగా వైద్యసేవలు అందలేదని గిరిజనులు వాపోతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతినెలా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించేందుకు ఈ వాహనాలు వీలుగా ఉండేవి. అయితే, వాహనం మరమ్మతులతో నెలరోజులుగా గ్రామాలకు ఈ వాహన సేవలు నిలిపేసినట్టు తెలుస్తోంది. పినకోట పీహెచ్‌సీ పరిధి నుంచి జీనబాడు పంచాయతీ కేంద్రంలో ప్రతినెలా రెండో సోమవారం, పెదగంగవరంలోని మూడో గురువారం, దిబ్బపాలెంలోని నాలుగో శనివారం వైద్యసేవలను అందించాలి.. పెదకోట పంచాయతీ వేలమామిడి మూడో శనివారం, కుడియాలో రెండో బుధవారం, నెలఖారున చటకంభ వద్ద వాహనం వెళ్లాల్సి ఉంది. కివర్ల పం చాయతీలోని జాలడలోని రెండో మంగళవారం, కివర్లలోని మూడో శుక్రవారం, నెలఖారులో టెంకలవలస వద్ద రోగులకు వైద్య సేవందించాలి. గత నెలరోజులుగా వాహన రాలేదని, గిరిజనులు వాపోతున్నారు.. వచ్చినా సేవలు మా త్రం అంతంతంత మాత్రంగానే అందుతున్నాయని చెబుతున్నారు. అలాగే గత నెలలో భీమవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యసేవలు అందలేదు. అధికారులు స్పందించి, కొత్త వాహనం ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని గిరిజనులు కోరుతున్నారు.

'ఆక్రమణలు తొలగించాలి'

జి.మాడుగుల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని మండలాల ప్రధాన కూడళ్లకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని పెసా కమిటీ మండల నాయకులు ఎల్.రామకృష్ణ, శ్రీను డిమాండ్ చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాన రహదారులకు ఇరువైపులా నిర్మాణాలతో పాదచారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గుర్తు చేశారు. రాజకీయాలకు తలొగ్గకుండా రంపచోడవరం, మారేడిమిల్లి ప్రాంతాల తరహాలో అన్ని మండలాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా 100 అడుగులు విస్తరణ ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు కోరారు.నాయకులు బి.సూరిపడాల్, బాలకృష్ణలున్నారు.

మండలాలకు టీడీపీ ఇన్‌చార్జిల నియామకం


కొయ్యూరు ఇన్‌చార్జిగా శెట్టి బాబూరావు,


రహమాన్, జి.మాడుగల


దాసుబాబు, చింతపల్లి

అరకులోయ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో చురుకైన పాత్ర పోషించిన నేతలకు అధిష్టానం గుర్తింపునిచ్చింది. వివిధ మండలాలకు ఇన్‌చార్జిలుగానియమించింది. పార్టీఅరకులోయ మండల అధ్యక్షుడిగా సేవలందించిన శెట్టి బాబూరావుకు కొయ్యూరు మండల పార్టీ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జాఈ చేసింది. మైనార్టీ నేతగా పార్టీలో సేవలందించిన ఎస్‌కే రహమాన్‌ను జి.మాడుగల, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్, సీనియర్ నాయకుడుదాసుబాబుకు చింతపల్లి మండలం ఇన్‌చార్జిగా నియమించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

దుంబ్రిగుడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కొల్లాపుట్టు గ్రామ పంచాయతీ సచివాలయం కేంద్రంలో ఎగువ కొల్లాపుట్టు రెవెన్యూకు సంబంధించి గ్రామ గిరిజనులకు స్థానిక సర్పంచ్ రామ్మూర్తి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి గురుమూర్తి పర్యవేక్షణలో భాగంగా శనివారం దర్తి అభయాన్ భగీరథి అభియాన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గిరిజనులకు అవగహన కల్పించారు. ఈ శ్రమ కార్డులను 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుందరరవు, పెసా కమిటీ సభ్యులు చిరంజీవి, భీమారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న వైద్యాధికారికి సన్మానం


వైద్యాధికారి సౌమ్యను సన్మానిస్తున్న సిబ్బంది

సీలేరు, జూన్ 28 , (ఆంధ్రజ్యోతి):బాపట్ల పెరవలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బదిలీ వెళ్తున్న సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె సౌమ్యకు శనివారం వైద్య సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సౌమ్య మాట్లాడుతు తాను 2022లో సీలేరు ఆస్పత్రిలో వైద్యాధికారిగా విధుల్లో చేరానని, ఈ రెండున్నరేళ్లు ఈ ప్రాంత గిరిజనులకు సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సిబ్బంది, , గ్రామపెద్దలు అందరూ సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఎన్. త్రినాథ్, బి. బాలామణి, స్టాఫ్‌నర్సులు కె. దేవి, వి . హైమా, ఎం. మాధురి, ఫార్మసిస్టు సాయికృష్ణ, ల్యాబ్ టెక్నిషియన్ వి. శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

గూడెంకొత్తవీధి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్ తెలిపారు. మండల పరిశీలకుడు తుండు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందనిన్నారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

సీలేరులో వానరమూక స్వైర విహారం

- గ్రామస్థులు బెంబేలు


జెన్‌కో కాలనీ ఇళ్లపై తిష్ట వేసిన కోతులు

సీలేరు, జూన్ 28 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో వానర మూకతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వందలాది సంఖ్యలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి వండుకున్న ఆహార పదార్థాలను పాత్రలతో సహా పట్టుకుపోతున్నాయి. అదిలిస్తే ఎక్కడ దాడి చేస్తాయోనని స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్న పిల్లలు ఏదైనా చేతిలో పట్టుకుని వెళ్లే వారిపై దాడి ఆ వస్తువులను ఎత్తుకుపోతున్నాయి. ఇళ్ల ఆవరణలో ఉన్న జామ, అరటి, మామిడి, సపోటా మొక్కల ఫలసాయాన్ని పిందెలుగా ఉన్నప్పుడే కోసేస్తూ నేలపాలు చేస్తున్నాయి. పెరట్లల్లో కాయకూరలను కూడా పెరగకుండానే నాశనం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అలాగే సర్వీస్ వైర్లపైన, ఇళ్ల పైకప్పులపైనా ఇష్టారీతిగా తిరగడంతో నిత్యం విద్యుత్ వైర్లు తెగిపోయి ఇళ్ళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. పైన రేకులు ధ్వంసం చేస్తుండంతో వర్షం వస్తే ఇళ్లు కారిపోతున్నాయి. కోతుల బెడదకు భయపడి పగటి సమయంలో కూడా ప్రజలు ఇళ్ల తలుపులు మూసుకునే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒంటరిగా ఆడవాళ్లు మార్కెట్‌లో సరకులు తేవాలన్నాకోతులు ఎక్కడ దాడి చేస్తాయోనని ఇద్దరు , ముగ్గురు కలసి వెళ్తున్నారు. సీలేరులో గతంలో పదేళ్ల క్రితం కోతుల బెడద అధికంగా ఉన్నప్పుడు జెన్‌కో అధికారులు సుమారు 500 వరకు కోతులను పట్టించి దూరంగా రేయిన్‌గేజ్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో కొంత కాలం కోతుల బెడద తగ్గింది. ఆ సమయంలో కొన్ని మిగిలిపోయాయి. వాటితో క్రమంగా కోతుల సంఖ్య పెరుగుతూ వచ్చి ప్రస్తుతం వందలాది సంఖ్యకు చేరాయి. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు జెన్‌కో అధికారులు, గ్రామ పంచాయతీ అధికార్లను కోరుతున్నా ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

11 ప్రాథమిక పాఠశాలలు మోడల్ స్కూళ్లుగా మార్పు


చింతలపూడిలో స్కూల్ మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ తదితరులు

కొయ్యూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మార్పుచేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక ఎంఈవో రాంబాబు తెలిపారు. అయితే, ఈ ప్రాథమిక పాఠశాలల్లో ఇకపై ప్రతీ సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. ఈ మేరకు మండలంలో యు. చీడిపాలెం, కుసుకూరు, గంగవరం, కొయ్యూరు జీపీఎస్, రాజేంద్రపాలెం, మర్రివాడ, చింతలపూడి, ఎం. మాకవరం, రావణాపల్లి, శరభన్నపాలెం, డౌనూరు పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మార్పు చేశారన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈవో తెలిపారు.ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల ద్వారా గ్రామాల్లోనే రేషన్ పంపిణీ

- విజయవాడ సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్


చినకోనేలలో గిరిజనుల నుంచి వివరాలను సేకరిస్తున్న అధికారులు

అనంతగిరి, జూన్ 28 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనేల గ్రామాలను శనివారం నుంచి విజయవాడ సివిల్ సప్లై కమిషన్ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, ఇన్ఫర్మేషన్ ఏడీ అనుదీప్ యాదవ్, అల్లూరి జిల్లా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్ సందర్శించారు. రేషన్ సరకులను గ్రామాల్లో పంపిణీ చేయక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులు ఈనెల 12 తేదీన అటవీ ప్రాంతంలో బియ్యం మూటల కావిళ్లతో నిరసన తెలిపారు.. దీనిపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు.. కలెక్టర్‌తో పాటుగా విజయవాడ సివిల్ సప్లై అధికారులకు ఈ సమస్యపై లేఖను రాశారు.. దీనిపై స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించారు. బూరిగ, చినకోనేల గ్రామాలకు గిరిజనులు రేషన్ సరకులు తెచ్చుకునేందుకు రొంపల్లి పంచాయతీ కేంద్రానికి రానుపోను 16 కిలో మీటర్ల నడవాల్సి వస్తోందని అధికారులకు గిరిజనులు చెప్పారు. దీంతో వాహనం ఏర్పాటు చేసి, గ్రామాల్లో రేషన్ సరకులు ఇచ్చేవిధంగా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని ఆర్ఐ జగ్గయమ్మ, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం: ఎంపీడీవో


గుమ్మిరేవుల పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరావు తెలిపారు. శనివారం మండలంలోని శివారు గుమ్మిరేవుల పంచాయతీని ఎంపీడీవో సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యం మెరుగు పనులను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈమేరకు గృహ పరిసరాలు, వీధులు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. మురుగు కాలువాల్లో పూడికను తొలగిస్తున్నామన్నారు. ప్రతి రోజు వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ వేస్తున్నామన్నారు. రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను గృహల్లో భద్రపర్చి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు, సర్పంచ్ ముర్ల కమల తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


చింతపల్లిలో ప్రైవేట్ వ్యక్తుల వినియోగంలోనున్న భవనం కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

చింతపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి ఎదురుగానున్న ఆక్రమణలు కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశాలిచ్చిన అరగంటలో స్థానికులు తొలగించారు. శనివారం చింతపల్లిలో పర్యటించిన కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు వినియోగంలోనున్న శిథిల భవనం, కార్యాలయం ఎదురుగానున్న దుకాణ బడ్డీలను తొలగించాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ టి. రామకృష్ణ వెనువెంటనే ఎక్స్‌కవేటర్‌ని తీసుకువచ్చి ప్రైవేటు వ్యక్తుల వినియోగిస్తున్న శిథిల భవనాన్ని కూల్చివేశారు. దీంతో అప్రమత్తమైన వ్యాపారులు రెవెన్యూ కార్యాలయం ఎదురుగానున్న దుకాణ బడ్డీలను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. ఆక్రమణల తొలగింపు కొనసాగిస్తామని తహశీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు.

పీజీ సెట్‌లో సంజనాకు 186వ ర్యాంక్


సంజన

దుంబ్రిగుడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు సంతబయలు గ్రామానికి చెందిన కోర్రా భూపాల్, అన్నపూర్ణ దంపతుల కుమార్తె సంజన పీజీ సెట్ పరీక్షల్లో (సైకాలజీ) 186 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

ప్రహరీ గోడ లేక.. పాఠశాలలోకి పశువులు


సీతగుంట బాలుర పాఠశాలలో ప్రవేశించిన పశువులు

పెదబయలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి సీతగుంట గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలుర - 2 పాఠశాలలో ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పశువులు, కుక్కలు లోనికి ప్రవేశించి స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాటిని బయటకు తరిమినా మళ్లీ ఆవరణలో చేరిపోతున్నట్టు చిన్నారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మించాలని సిబ్బంది విద్యా శాఖ అధికారులకు విన్నవించడంతో మండల స్థాయి అధికారులు వచ్చి అంచనాలు వేశారు.. తప్పా పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించక ఈ పరిస్థితి నెలకొన్నట్టు సమాచారం. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలని సిబ్బంది, విద్యార్థులు కోరుతున్నారు.



వాహనానికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ పద్మావతి.. (ఇన్‌సెట్‌లో) ట్రాక్టర్ నడుపుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పారిశుధ్య వాహనాలు ప్రారంభం

నర్సీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో కోటి రూపాయలతో కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం ప్రారంభించారు. అబీద్ సెంటర్‌లో తహశీల్దార్ కార్యాలయం వద్ద కాంపాక్టరు, రెండు హైడాలిక్ ట్రాక్టర్లకు చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పూజలు చేశారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు పచ్చ జెండా ఊపి కాంపాక్టర్‌ను ప్రారంభించారు. తర్వాత ట్రాక్టర్ డ్రైవింగ్ చేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఆయన ట్రాక్టర్ స్టార్ట్ చేసే సమయంలో మునిసిపల్ సిబ్బంది సహాయం చేయడానికి వెళ్లబోగా, 'అవసరం లేదు నాకు తెలుసు' అంటూ నవ్వుతూ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ.రమణ, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, తహశీల్దార్ రామారావు, టీడీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



రోలుగుంట పీఏసీఎస్‌లో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో విత్తనాలను అందిస్తున్నామన్నారు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలనే సాగుచేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చిరంజీవి, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, నాయకులు సుర్ల రామకృష్ణ, పంచాడ చంద్ర, బంటు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించండి

▸▸ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ పంచాయతీ కార్యదర్శులకు డీపీవో సందీప్ ఆదేశం



వెంకన్నపాలెంలో పారిశుధ్యం పరిస్థితిని పరిశీలిస్తున్న డీపీవో సందీప్

చోడవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఈ.సందీప్ ఆదేశించారు. మండలంలోని వెంకన్నపాలెం, అంబేరుపురం పంచాయతీలను శనివారం సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు పారిశుధ్యంపై ప్రత్యేక సూచనలు ఇచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అలాగే ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేసి, వాటిని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీఎస్‌జే.ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్ పాల్గొన్నారు.

సుందర భవనం.. నిరుపయోగం!

▸▸ ప్రారంభానికి నోచుకోని పోలీసు స్టేషన్ కొత్త భవనం



నాతవరంలో ప్రారంభానికి నోచుకోని పోలీసు స్టేషన్ నూతన భవనం

నాతవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ నూతన భవనం ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో సుందర భవనం నిరుపయోగంగా మారింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలీసు స్టేషన్ కోసం కొత్త భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించగా, అప్పటి నుంచి నత్తనడకన సాగాయి. ఎట్టకేలకు 2024లో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయినప్పటికీ ప్రారంభించకుండా వదిలేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడంతో ఇక్కడ పోలీసు సిబ్బందికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పోలీసు అధికారులు తక్షణమే స్పందించి నాతవరంలో నిరుపయోగంగా ఉన్న నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని పోలీసు సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ మద్యం సీసాలు కనిపించడకూడదు

▸▸ మద్యం దుకాణాల యజమానులకు ఈవోపీఆర్డీ ఆదేశం

రావికమతం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్యం దుకాణ యజమానులు ఖాళీ మద్యం సీసాలను ఎక్కడా కనిపించకుండా చూడాలని ఈవోపీఆర్డీ సీతారామస్వామి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, మద్యం దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మద్యం దుకాణాల వద్ద అధిక సంఖ్యలో ఖాళీ గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు పోగులుగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ సీసాలు రహదారులపైకి ఆకతాయిలు పడేయడంతో , అవి పగిలిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల ఖాళీ సీసాలు కనిపిస్తే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు ఎంపీడీవో వెంకన్నబాబుతో కలసి రావికమతం, టి.అర్జాపురం పంచాయతీల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

▸▸ జి.కోడూరులో రెండు వారాలుగా సరఫరా బంద్

▸▸ బిందెడు నీటికి మైళ్ల దూరం వెళ్తున్న మహిళలు



జి.కోడూరులో తాగునీటి కుళాయి వద్ద బారులు తీరిన మహిళలు

మాకవరపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు గ్రామంలో రెండు వారాలుగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలో అంగన్‌వాడీ భవనం వద్ద ఉన్న మంచినీటి పథకం మెటారు మరమ్మతులకు గురికావడంతో కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదు. దీంతో మైళ్ల దూరం వెళ్లి ప్రైవేటు వాటర్ ప్లాంటు వద్ద నీటిని కొనుగోలు చేసుకుంటున్నామని గ్రామంలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తోమత లేని వారు గ్రామంలోని పక్క వీధిలో ఉన్న ప్రైవేటు మోటరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కుళాయిల నుంచి తాగునీరు వచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

నాతవరం వైఎస్సార్ కాలనీలో...

నాతవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైస్సార్ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల నుంచి అర గంటకు మించి తాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. దీంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఈ సమస్యను పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతున్నదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కాలనీలో వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు విజ్ఞప్తి చేశారు.

బీఎన్ రోడ్డులో గోతులైనా పూడ్చండి

ఎమ్మెల్యే రాజు ఎదుట టీడీపీ నాయకుల మొర

మంగళవారంలోగా మరమ్మతు పనులు పూర్తిచేయాలని

కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులకు ఫోన్‌లో ఎమ్మెల్యే ఆదేశాలు



బీఎన్ రోడ్డులో మేడివాడ గోతుల వద్ద కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ వాహనాలు కూరుకుపోయి టాఫిక్‌కు తీవ్ర ఆటంకం కల్పిస్తున్న బీఎన్ రోడ్డులోని మేడివాడ వద్ద గోతులను పూడ్చాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఎదుట టీడీపీ నాయకులు మొర పెట్టుకున్నారు. శనివారం రోలుగుంట వెళ్తున్న ఎమ్మెల్యే రాజు వద్దకు వారు వెళ్లి, మేడివాడ ఆంజనేయస్వామి గుడి నుంచి వినాయక ఆలయం వరకు నడిచి రోడ్డులో చెరువును తలపించేలా ఉన్న గోతులను చూపించారు. ఈ గోతుల్లో రెండు, మూడు వాహనాలు కూరుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడిందని, దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యేకు టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, మేడివాడ సర్పంచ్ వజ్రపులీలా, నాయకులు వజ్రపు శివ తదితరులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే రాజు స్పందించి అక్కడ నుంచే కాంట్రాక్టర్‌కు ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారంలోగా ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని వారికి ఎమ్మెల్యే ఆదేశించారు. తాను కూడా అదే రోజు ఇక్కడికి వస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు, నాయకులు గొర్లె విజయ్‌కుమార్, బంటు శ్రీనివాసరావు, గొర్లె సాంబశివ, కసిరెడ్డి చినబాబు, సీతిన రాము, గొల్లవెల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎరకన్నపాలెంలో ప్రభుత్వ భూమి సర్వే

▸▸ ఆక్రమణదారులు, బడాబాబుల్లో గుబులు



ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరకన్నపాలెం గ్రామంలో శనివారం ఎట్టకేలకు ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. రాచపల్లి రెవెన్యూలోని ఎరకన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో 737 సర్వే నంబరులో సుమారు 1400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఆయా గ్రామాలకు చెందిన వారితో పాటు పరిసర ప్రాంతాల వారు ఆక్రమించి సాగు చేస్తున్నారు. భూమి సాగు చేస్తున్న వారిలో కొంత మంది బడాబాబులు ఉన్నారు. వారి గుప్పిట్లో పది నుంచి 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. శనివారం చేపట్టిన సర్వేతో బడాబాబుల్లో ఆందోళన మొదలైంది. సర్వే చేస్తుండడంతో భూ ఆక్రమణలుదారులు తమ పేర్లతో పాటు తమ బంధువుల పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. అయితే భూమి ఎందుకు సర్వే చేస్తున్నారు? ఫొటోలు ఎందుకు తీస్తున్నారో? ఆక్రమణదారులకు తెలియకపోవడంతో తికమకపడుతున్నారు. అయితే సర్వే కోసం నలుగురు వీఆర్‌వోలు, ఆరుగురు సచివాలయ సర్వేయర్లను నియమించినట్టు తహశీల్దార్ జి.వెంకటరమణ తెలిపారు. మూడు రోజుల్లో సర్వే పూర్తిచేయాలని సిబ్బందికి సూచించినట్టు తహశీల్దార్ తెలిపారు.

63 అడుగుల మట్టి గణపతి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం

▸▸ శంకుస్థాపన కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులు



మట్టి గణపతి విగ్రహ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సభ్యులు

చోడవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం సమీపంలో 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్వయంభూ గణపతి ప్రశస్తి మరింత మందికి తెలిసేలా స్థానిక సద్భావన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 63 అడుగుల భారీ మట్టి విగ్రహం నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సందర్భంగా వినాయకుని ఆలయ సమీపంలోని స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ మట్టి విగ్రహం పనులు పూర్తి కావడానికి రెండు నెలలకుపైగా సమయం పడుతుందని, ఉత్సవాల నాటికి సిద్ధమవుతుందని సద్భావన ఫౌండేషన్ ఫౌండర్ కె.రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, వినాయక, గౌరీశ్వర ఆలయాల చైర్మన్లు పసుమర్తి సాంబమూర్తి, గూనూరు సురేశ్, సభ్యులు పసుమర్తి శ్రీనివాసరావు, చేకూరి రాజు, ఉగ్గిన నాగబాబు, గనిరెడ్డి. కోరుకొండ సత్తిబాబు, దేవరపల్లి కుమారి, స్వయంభూ విఘ్నేశ్వర ఆలయం అర్చకులు కొడమంచిలి చలపతి పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు



మేకలకు టీకాలు వేస్తున్న డాక్టర్ శిరీషా

కృష్ణాదేవిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేస్తున్నట్టు పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీషా చెప్పారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగసింగి, నాగాపురం తదితర గ్రామాల్లో శనివారం నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలకు ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. దీనివల్ల మేకలు, గొర్రెలకు పొట్ట జలగలు, మధ్య పురుగులు, ఏలికపాముల సమస్య ఉండదని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది హరి, దొరబాబు, రాంబాబు పాల్గొన్నారు.

సమన్వయ సమావేశంలో భూ సమస్య పరిష్కారం



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మండల స్థాయి అధికారులు

మాడుగుల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అధికారుల సమన్వయ సమావేంలో భూ సమస్యను పరిష్కరించారు. మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ సమక్షంలో ఫిర్యాదుదారుల సమస్యలను విచారించారు. ఇరు వర్గాలను కూర్చోబెట్టి ఒక భూ సమస్యను పరిష్కరించారు. రెండు ఫిర్యాదులపై సమస్య కొలిక్కి రాకపోవడంతో కోర్టుకు వెళ్లాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేపీ.నాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్ఐ జి.నారాయణరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల సాయం

▸▸ బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి చేయూత

చోడవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బాలికలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించారు. కళాశాలలో రూ.2.3 కోట్ల వ్యయంతో విద్యార్థినుల కోసం మరుగుదొడ్లను నిర్మించి, శనివారం వాటిని కాలేజీ అధ్యాపకులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఐవీ.సత్యవతి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గౌరీశంకర్, గుప్తా, బాబీ, అధ్యాపకులు పాల్గొన్నారు

కూర్మవతారంలో జగన్నాథుడు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

మాడుగుల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మాడుగుల నూకాలమ్మ కాలనీలోని అత్తవారిళ్ల ఇంద్రజ్యుమ్నంకు చేరిన స్వామివారు శనివారం భక్తులకు కూర్మవతావరంలో దర్శనమిచ్చారు. శనివారం రెండో రోజు ఇంద్రజ్యుమ్నంలో ఉన్న జగన్నాథుడుకి ఆలయ అర్చకుడు పండా నూకరాజు కూర్మవతారంలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మవతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను చేసి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శెట్టిపాలెం పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

మాకవరపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం పాఠశాలను మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో పాటు విద్యా బోధన తీరును పరిశీలించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ప్రవేశాలు పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే రూ.20 లక్షలతో చేపట్టిన పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జూన్ ప్రసాద్, మూర్తి, సర్పంచ్ అల్లు రామునాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ చేపడతాం

చీడికాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో దివ్యాంగులకు ఉపాధి పనుల కల్పనపై త్వరలో బహిరంగ విచారణ చేపడతామని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి, ఎంపీడీవో వి.హేమసుందర్రావు తెలిపారు. 'ఖండివరం ఫీల్డ్ అసిస్టెంట్‌పై దివ్యాంగులు ఫిర్యాదు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఉపాధి పథకం ఏపీవో అల్లు గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ కె.మోహన్‌తో పాటు గ్రామానికి చెందిన ముగ్గురు దివ్యాంగులను పిలిపించి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసిన ఫిర్యాదును వివరించగా, ఖండివరం గ్రామానికి వచ్చి పనులను పరిశీలించి త్వరలో విచారణ చేపడతామని స్పష్టం చేశారు. ఉపాధి పనులకు సంబంధించి అన్ని రికార్డులను సిద్ధం చేసుకోవాలని సిబ్బంది ఆదేశించారు

550 జీవాలకు నట్టల నివారణ టీకాలు

నర్సీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడిలో పశు సంవర్ధక శాఖ అధికారులు శనివారం 550 మూగజీవాలకు నట్టల నివారణ టీకాలు వేశారు. మేకలు, గొర్రెలకు పశు వైద్యాధికారి డాక్టర్ పి.నరేశ్ ఈ టీకాలను ఉచితంగా వేశారు. ఎంపీటీసీ సభ్యులు బోళెం రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో కూడా నట్టల నివారణ టీకాలు వేశారు. వచ్చే నెల 10వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

నర్సీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో వీధి దీపాలు, ఇంజనీరింగ్, నీటి సరఫరా, పార్కులలో పని చేస్తున్న కార్మిల సమ్మె కొనసాగుతున్నది. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. వినూత్నంగా శిబిరం ముందు వీధి దీపం, కుళాయి, బోరు నమోనాలకు పూల దండలు వేసి ప్రదర్శించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

చీడికాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి పంచాయతీ కార్మికులకు అందించాలని ఎంపీడీవో వి.హేమసుందర్, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్.చంద్రశేఖర్‌రావు తెలిపారు. మండలంలోని జైతవరం గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఎంపీడీవో శనివారం పరిశీలించగా, దండిసురవరంలో కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో పరిశీలించి ఆయా గ్రామాల మహిళలతో సమావేశమయ్యారు. ప్రతీ ఇంటి దగ్గర ఉన్న తడి, పొడి చెత్తలను పారిశుధ్య కార్మికులకు అందించి పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. అలాగే పారిశుధ్య కార్మికులకు పలు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు కోన అర్జున, కోడూరు సత్యవతి, పట్నాల గోపి పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

బుచ్చెయ్యపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం రైతు సేవా కేంద్రంలో శనివారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. రాజాం. నీలకంఠాపురం గ్రామాల్లో ఎంటీయూ-1075 రకం ఎక్కువగా పండిస్తున్నారని, గింజ పై మచ్చ రావడం, ధాన్యం ఆడించే సమయంలో గింజ ముక్కలు కావడంతో దీన్ని ప్రభుత్వం నిషేధించిందని ఈ సందర్భంగా ఎంపీఈవో సంతోశ్ తెలిపారు. దీనికి బదులుగా ఆర్‌జేఎల్, సోనా మసూరి, సాంబమసూరి, స్వర్ణ, ఇంద్ర రకాలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరిశా నాని, నాయకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై విచారణ

చీడికాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్పందన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తామని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి అన్నారు. మండలంలోని అర్జునగిరి, మంచాల గ్రామాల నుంచి భూ సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు చేసిన ఫిర్యాదులపై మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో శనివారం విచారించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల రైతుల నుంచి తలెత్తిన భూ సమస్య ఆధారాలను తెలుసుకున్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేకూరుస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిశోర్ లింకన్, ఎంపీడీవో హేమసుందర్రావు, సీనియర్ అసిస్టెంట్ కె.రామారావు పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చండి

దేవరాపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నియోజకవర్గ తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిం నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు వేచలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా విధుల్లో చేరిన వైద్యులు రమేశ్‌బాబు, శకుంతలను శనివారం కలిసి శాలువలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేచలం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొరవిల్లి చినరాము, కృష్ణ ఉన్నారు.

మాడుగులలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి

మాడుగుల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పీవీ కీలకపాత్ర పోషించారన్నారు. నాయకులు అప్పారావు, యేసురాజు, గుప్తా పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

- మావోయిస్టుల ప్రభావం నేపథ్యంలో నిర్ణయం

పాడేరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గంగొయ్యి గ్రామంలో జరగాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన రద్దయింది. వాస్తవానికి సీఎం జూలై ఒకటిన పాడేరు మండలం ఉగ్గంగొయ్యి గ్రామాన్ని సందర్శించి పలువురు లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును అందించి, అక్కడకు సమీపంలో గిరిజనులతో బహిరంగ సభ నిర్వహించాల్సి ఉంది. అయితే పాడేరు ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం దృష్ట్యా నిఘా వర్గాల సూచన మేరకు ఈ పర్యటన రద్దు అయింది. దీంతో ముఖ్యమంత్రి పర్యటనను కాకినాడ జిల్లా జగ్గంపేటకు మార్పు చేసినట్టు తెలిసింది. కాగా సీఎం బహిరంగ సభ వేదిక ఏర్పాటు చేసేందుకు రప్పించిన సామగ్రిని తిరిగి కాకినాడ జిల్లాకు తరలిస్తున్నారు. సీఎం పర్యటనపై ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయని కలెక్టర్ దినేశ్‌కుమార్ పాడేరులో ప్రతికూల వాతావరణం నేపథ్యంలోనే పర్యటన రద్దయిందని శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలపడం విశేషం.

రియల్టర్ బరి తెగింపు

గెడ్డ వాగులోంచి లే అవుట్‌కు రహదారి ఏర్పాటు

- చోద్యం చూసిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- రైతుల ఆగ్రహంతో ఎట్టకేలకు కదలిక
- వీఆర్వో పర్యవేక్షణలో తొలగింపు

పరవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

గెడ్డ వాగులోంచి ఓ రియల్టర్ దర్జాగా రహదారిని ఏర్పాటు చేసుకున్నాడు. నిబంధనలు తుంగలోకి తొక్కి ఈ పనులు చేపట్టినా తమకేమీ పట్టనట్టు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు వ్యవహరించారు. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు స్పందించారు. శనివారం సాయంత్రం తొలగింపు పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలివి.


గెడ్డవాగును కప్పేసి దాంట్లోంచి ఏర్పాటు చేసిన రహదారి


రైతుల ఆగ్రహంతో ఎక్స్‌కవేటర్ ద్వారా రహదారి తొలగింపు దృశ్యం

ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గం పరవాడలోని పైడిమాంబ ఆలయానికి సమీప రహదారిని ఆనుకొని పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 300లో పెద్ద గెడ్డవాగు ఉంది. వాగు అవతల ఓ రియల్టర్ ఇటీవల రైతుల నుంచి భూములను కొనుగోలు చేశాడు. సదరు భూముల్లోకి వెళ్లాలంటే సరైన మార్గం లేదు. దీంతో రియల్టర్ కన్ను గెడ్డవాగుపై పడింది. అనుకున్నదే తడువుగా వాగులోంచి గ్రావెల్‌తో సుమారు 60 అడుగుల మేర రహదారిని రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో ఏర్పాటు చేయించాడు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున ప్రవహించే వాగుపై నుంచి రహదారి ఏర్పాటు చేయడంతో రైతులు గగ్గోలు పెట్టారు. సుమారు పది సెంట్ల మేర గెడ్డవాగును ఆక్రమించుకొని దర్జాగా రహదారి నిర్మాణం చేపట్టాడంటూ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాన రహదారిని ఆనుకొని సెంటు భూమి ధర ఇక్కడ రూ.మూడు లక్షలకు పైగా ఉంది. రహదారి ఏర్పాటు చేస్తే ధర మరింత పెరుగుతుందని భావించి ఈ నిర్మాణం చేపట్టాడనే ఆరోపణలు వినిపించారు. ఇక్కడి పరిస్థితులు అధికారుల దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు వారిలో కదలిక ఏర్పడింది. చివరకు గెడ్డ వాగులోంచి ఏర్పాటు చేసిన రహదారిని వీఆర్వో శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం సాయంత్రం తొలగింపు పనులు చేపట్టారు. దీనిపై వీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాగులోంచి రహదారి ఏర్పాటు చేసిన సదరు రియల్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వాగులోంచి యథావిధిగా నీరు పారేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- వైసీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో 'బొత్స'


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదని, ఈ విషయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని రింగురోడ్డులో గల ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి జరిగిన వైసీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారన్నారు. నేటి వరకు రైతులకు అన్నదాత సుఖీభవ అందకపోవడం చూస్తుంటే వీరికి రైతుల పై ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ తీరును ప్రజల్లో తీసుకు వెళ్లాలని సూచించారు. పార్టీ రీజనల్ ఇన్‌చార్జి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో కోతలు, వాతలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఏటా రైతు భరోసా అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి మేనిఫెస్టోను ప్రజల ముందు తీసుకు వెళ్లి ఎండగట్టాలన్నారు. కక్ష సాధింపు తప్ప, ఏడాదిలో ప్రజలకు చేసేందేమీ లేదని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ త్వరలోనే గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేశ్, కంబాల జోగులు, పార్టీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, మిలట్రీ నాయుడు, సూర్యనారాయణరాజు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, అనకాపల్లి పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల గేలాలకు కొమ్ముకోనెం, అభిలాష చేపలు


పూడిమడక తీరంలో కొమ్ముకోనెం చేపలు

అచ్యుతాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధం అనంతరం కొంగొత్త ఉత్సాహంతో ముందుకు సాగిన మత్స్యకారుల గేలాలకు భారీ చేపలు చిక్కాయి. దీంతో వారి ఆనందానికి అవధులు లేవు. మండలంలోని పూడిమడక గ్రామం నుంచి మత్స్యకారులు బోట్లలో శనివారం ఉదయం వేటకు బయల్దేరి వెళ్లారు. వారి గేలాలకు కొమ్ముకోనెం, అభిలాష (అపోలో ఫిష్), టూనా వంటి చేపలు భారీగా చిక్కడంతో సాయంత్రం పూడిమడక తీరానికి చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం కొనుగోలుదారులతో సందడిగా మారింది. కొమ్ముకోనెం చేప ఒక్కొక్కటి సుమారు 20 నుంచి 30 కేజీల బరువు ఉంది. అలాగే అభిలాష చేపలు కూడా భారీ గానే పడ్డాయి. వ్యాపారులు ఈ రెండు రకాల చేపలను కేజీ రూ.250 చొప్పున కొనుగోలు చేశారు.

రైల్వే జీఎంకు 'సౌత్ సెంట్రల్' బాధ్యతలు

- మూడు నెలలు అక్కడ పనిచేయాల్సిందే...
- ఆగస్టు నుంచి ఇక్కడ జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం అనుమానమే
- విశాఖ జోన్ పనులు ఆలస్యం కావడానికి ఒడిశా అధికారులు కావాలనే ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైల్వే వర్గాల ఆరోపణ


సందీప్ మాథుర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా జోన్‌కు ఇటీవలె జనరల్ మేనేజర్‌గా నియమితులైన సందీప్ మాథుర్‌కు ఇప్పుడు అదనపు బాధ్యతలు అప్పగించారు. సికింద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తుండడంతో ఆ జోన్ బాధ్యతలు సందీప్ మాథుర్‌కు అప్పగిస్తూ రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్ పాండే ఉత్తర్వులు జారీచేశారు. ఇది పేరుకు అదనపు బాధ్యతలే కానీ పూర్తి ఆపరేషన్‌లో ఉన్న ఆ జోన్‌ను సమర్థంగా నడిపించాల్సి ఉంటుంది. అందుకని కనీసం వారంలో నాలుగు రోజులు అక్కడ ఉండాల్సి వస్తుంది. ఇటు చూస్తే ఇక్కడ జోనల్ కార్యాలయం లేదు. నిర్మాణ పనులు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయి ఆపరేషన్ ప్రారంభం కాలేదు. ఆగస్టు 15 నుంచి పూర్తిస్థాయిలో జోన్ పనిచేస్తుందని ఈ ప్రాంత పార్లమెంటు సభ్యులకు ఢిల్లీ పెద్దలు హామీ ఇచ్చారు. ఇంకో రెండు నెలలే కదా?...అనుకున్నారు. ఇప్పుడు పక్క జోన్ బాధ్యతలు అప్పగించడంతో జీఎం సందీప్ మాథుర్ విశాఖపట్నం కంటే సికింద్రాబాద్‌లోనే ఎక్కువ కాలం ఉండాల్సి ఉంటుంది. అక్కడ కొత్త జీఎంను నియమించేంత వరకు కనీసం మూడు నెలలు అదనపు బాధ్యతలు నిర్వహించాలని రవీందర్ పాండే తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంటే సెప్టెంబరు నెలాఖరు వరకూ అక్కడే ఉండాలి. అప్పటికి కూడా కొత్త జీఎంను నియమించకపోతే ఇంకా కొనసాగాల్సి ఉంటుంది. ఈ అదనపు బాధ్యతలతో విశాఖ జోన్‌కు కొత్త జీఎంను నియమించారనే ఆనందం ఆవిరైపోయింది. ఒడిశా అధికారులు కావాలనే విశాఖ జోన్ పనులు ఆలస్యం కావడానికి ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైల్వే వర్గాలు ఆరోపిస్తున్నాయి. కొత్త జోన్‌ను ఒక మార్గంలో నడిపించడానికి పూర్తిస్థాయిలో పనిచేయాల్సిన జీఎంకు అత్యంత కీలకమైన జోన్ బాధ్యతలు అదనంగా అప్పగించడం ఏ విధంగాను సమంజసం కాదని రైల్వే ఉద్యోగులు వాదిస్తున్నారు. ఏదేమైనా జీఎం సందీప్ మాథుర్ విశాఖ జోన్‌ను నిర్లక్ష్యం చేయకుండా వారంలో కనీసం మూడు రోజులు ఇక్కడకు వచ్చి జోనల్ కార్యాలయం నిర్మాణ పనులతో పాటు ఇతర వ్యవహారాలను పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

బాబ్జీ x మేయర్

... 5వ పేజీ తరువాయి

పీలా ఆరోపించారు. 'కార్యకర్తలను సమన్వయం చేసుకునే బాధ్యత మీకు లేదా?, గతంలో ఎమ్మెల్యేగా కూడా చేశారు కదా. మీకంటే ముందే నగర పార్టీ అధ్యక్షుడుగా చేశాను. రాష్ట్ర పార్టీలో పలు పదవులు చేపట్టాను. ఇదేనా సీనియర్లకు ఇచ్చే గౌరవం'...అంటూ పీలా అసంతృప్తి వ్యక్తం చేశారు. పీలా వ్యాఖ్యలకు గండి బాబ్జీ బదులిస్తూ 'మేయర్‌గా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న నాకు ఏనాడైనా ఆహ్వానం అందిందా. నగరం వరకూ ఎందుకు?, కనీసం పెందుర్తిలోనైనా సమాచారం ఇవ్వక్కర్లేదా...ఇది సరైనదేనా, నువ్వు ఆలోచించుకోవాలి'...అన్నారు. దాంతో పీలా లేచి వేరే మైకు అందుకుని ప్రోటోకాల్ కార్యక్రమాలకు, పార్టీ కార్యక్రమాలకు ముడి పెట్టవద్దని, అక్కడ పిలవలేదని అక్కసుతో పార్టీ కార్యక్రమాలకు పిలవరా...అని ప్రశ్నించారు. ఇరువురి నడుమ వాదోపవాదాలు కొనసాగడంతో పరిశీలకుడు కోరాడ రాజబాబు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. దీంతో సభలో ఉద్రిక్తత తగ్గి సాధారణ స్థితి నెలకుంది. అంతకుముందు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తనకు పార్టీ కార్యక్రమాలకు సంబంధించి ఇన్‌చార్జి నుంచి సమాచారం లేదని కరక దేవుడు ఆరోపించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, యని, ఇప్పుడు కనీస ప్రాధాన్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

పార్టీలో ఇవన్నీ సహజం

అనంతరం పరిశీలకుడు కోరాడ రాజబాబు మాట్లాడుతూ టీడీపీ అంతా ఒక కుటుంబమని, పార్టీలో అసంతృప్తులు సహజమని అన్నారు. అన్నీ సరిదిద్దుతాం, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామని అన్నారు. మండల, వార్డులకు సంబంధించి 15 మందిని సమన్వయకర్తలుగా నియమించామన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

- వచ్చే నెల 17వ తేదీ వరకూ అవకాశం
- జిల్లాల వారీగా సలహాల స్వీకారం
- విశాఖ రానవసరం లేకుండా స్థానికంగానే ఏర్పాట్లు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచినట్టు చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు శనివారం తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని సమీక్షించాలని నిర్ణయించింది.

ఈ మేరకు నష్టపోయిన వారి నుంచి అభ్యర్థనలు, ఇతరుల నుంచి సలహాలు స్వీకారానికి వీఎంఆర్‌డీఏ పిలుపునిచ్చింది. మే 22వ తేదీ నుంచి జూన్ 21 వరకు గడువు ఇచ్చారు. సుమారు రెండు వేల అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇచ్చిన సమయం సరిపోలేదని, గడువు ఇంకా పెంచాలని పలువురు కోరిన నేపథ్యంలో ప్రభుత్వ అనుమతితో ఈ గడువును జూలై 17వ తేదీ వరకు పొడిగించారు.

జిల్లాల వారీగా స్థానికంగా స్వీకారం

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ పరిధి విశాఖపట్నం జిల్లాతో పాటు అనకాపల్లి, విజయనగరం వరకు ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అభ్యంతరాలు సమర్పించడానికి ఇక్కడవరకూ రానవసరం లేకుండా స్థానికంగానే ఏర్పాట్లు చేశారు. దీనికి ప్రత్యేకంగా కొన్ని తేదీలు కేటాయించారు. ఆ రోజుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా దగ్గరుండి స్వీకరిస్తారు.

- అనకాపల్లి, పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల ప్రజల నుంచి జూన్ 30, జూలై 1 తేదీల్లో అనకాపల్లి ఆర్‌డీఓ కార్యాలయంలో అభ్యంతరాలు తీసుకుంటారు.
- పెందుర్తి, గాజువాక నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 3, 4 తేదీల్లో, విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 7, 8 తేదీల్లో, విశాఖ తూర్పు, భీమిలి నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 10, 11 తేదీల్లో సిరిపురం వీఎంఆర్‌డీఏ భవనంలోని మూడో అంతస్థులో దరఖాస్తులు తీసుకుంటారు.
- ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల నుంచి జూలై 14, 15 తేదీల్లో విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో అభ్యంతరాలు తీసుకుంటారు.
- జూలై 16, 17 తేదీల్లో చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు కలిసి ఏ జిల్లాల వారు వచ్చినా అభ్యంతరాలు స్వీకరిస్తారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

- ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఘటన

గొలుగొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందినట్టు కృష్ణాదేవిపేట స్టేషన్ ఎస్ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన షేక్ షాన్‌బాషా (52) నర్సీపట్నం అయ్యన్న కాలనీలో గత కొంత కాలంగా నివాసముంటున్నాడు. శనివారం ఉదయం నర్సీపట్నం నుంచి మండలంలోని కృష్ణాదేవిపేట బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో టవర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్సల అనంతరం 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

డ్రైనేజీ పనుల్లో రూ.కోటి అవినీతి

... 5వ పేజీ తరువాయి

చేశామని, త్వరలో కొత్తగా ఎక్స్‌కవేటర్ కూడా రాబోతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో పారిశుధ్య వాహనాలు, పని సామగ్రి కోసం రూ.1.3 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో వాళ్లు ఏం చేశారో?, ఈ ఏడాది కాలంలో తాము ఏం చేశామో పోల్చి చూడాలన్నారు. మునిసిపాలిటీలో సమగ్ర మంచినీటి పథకం కోసం సీఎం చంద్రబాబును అడిగి రూ.166 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా పూర్తి చేశామని, రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారని తెలిపారు. రూ.కోటి మినరల్ గ్రాంట్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్లు, వీఎంఆర్డీఏ రూ.4.11 కోట్ల నిధులతో మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మునిసిపాలిటీని అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణాన్ని తీర్చుకుంటానన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికో?

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ పదవి కట్టబెట్టింది. పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీకి టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవితో పాటు ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చింది. ఈ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జులను మార్చే అవకాశం ఉంది. కాగా పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోసం రాజాన రమేశ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని కుమారుడు లాలం భరత్ పోటీ పడుతున్నట్టు తెలిసింది. ఇన్‌చార్జుల నియామకాలపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోందని తెలిసింది.

తీరిన గిరిజన విద్యార్థుల కష్టాలు

... 5వ పేజీ తరువాయి

బడి మానేసిన నలుగురిని పినకోటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. వీరభద్రపేట నుంచి సొలబొంగి వరకు రహదారి నిర్మాణ పనులను గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈఈ గణేశ్ యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అంతకు ముందు ఆ గ్రామానికి వెళ్లడానికి అధికారులు చాలా కష్టాలు పడ్డారు. బోటులో, కాలినడకన ఆ గ్రామానికి చేరుకున్నారు. వారి వెంట దేవరాపల్లి ఎంఈవో ఉషారాణి, పినకోట, తామరబ్బ సర్పంచ్ గణేష, రామకృష్ణ, సీపీఎం నాయకుడు కె.గోవిందరావు, తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగానే భవనాలు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్ణయించింది. మే నెలలో ఆయా భవనాలకు జిల్లాలవారీగా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించి, భవన నిర్మాణాలు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లను ఇంజనీరింగ్ అధికారులు పిలిచి పనులు పూర్తి చేయాలని కోరుతున్నా, వారిలో స్పందన రావడం లేదు. గత ప్రభుత్వంలో తమకు ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా పనులు పునఃప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

కాంట్రాక్టర్లకు నోటీసులు

గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఆయా భవనాలు పూర్తి చేయాలని నోటీసులు జారీ చేస్తామని పీఆర్ ఈఈ వీరన్నాయుడు తెలిపారు. ఇప్పటికే ఐదుగురు కాంట్రాక్టర్లు అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం అసంపూర్తి భవనాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసిందని, బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం ఉండదని కాంట్రాక్టర్లు గుర్తించాలన్నారు. అసంపూర్తిగా వదిలేసిన సచివాలయ, హెల్త్ సెంటర్ల భవనాలను త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584